## క్లుప్తంగా

### పశుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోండి

టెక్కలి: పశు బీమా పథకానికి అర్హులైన పాడిరైతులు దరఖాస్తు చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ డీడీ వి.జయరాజ్ సూచించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకందారులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు పశు సంవర్ధక శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

### రోగులకు పండ్లు పంపిణీ



టెక్కలి: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

టెక్కలి: దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్థంతి సందర్భంగా టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పి.పరమేశ్వరరావు, నియోజకవర్గ కోఆర్డినేషన్ సభ్యుడు కె.మధుసూదన్‌రావు, నాయకులు పి.ఆనంద్, రమణ, సూర్యనారాయణ పాల్గొన్నారు. రాజీవ్‌గాంధీ హయాంలో చేపట్టిన సంస్కరణలను గుర్తు చేశారు.

### హరిపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' రేపు

మందస: హరిపురం పంచాయతీలో ఈ నెల 23వ తేదీన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ డొక్కరి దానయ్య, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి జరిగే కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది పాల్గొనాలని కోరారు.

### పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

నందిగాం: పాలిసెట్ ఫలితాల్లో నందిగాం మండలానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. తురకులకోట ఉన్నత పాఠశాలకు చెందిన కొప్పల స్వాతి రాష్ట్ర స్థాయిలో 2,790వ ర్యాంకు, దుంపల హేహని 3,351, నందిగాం ఉన్నత పాఠశాలకు చెందిన తెంబూరు ఉదయ్‌కుమార్ 4,528వ ర్యాంకు సాధించారు.

### పేదలకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

టెక్కలి: మంత్రి ధర్మాన ప్రసాదరావు పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలో యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు జి.గురునాథ్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు పేదలు, సాధువులకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. తొలుత కాశీవిశ్వనాథ ఆలయంలో మంత్రి ధర్మాన పేరిట పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్‌రెడ్డి, కె.మల్లేష్, ఆర్.శాంతమ్మ, ఆర్.కృష్ణ, బి.సురేష్, కె.జగదీష్ పాల్గొన్నారు.

### కాలువ నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న దేవదాస్‌రెడ్డి

కంచిలి: అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. పురుషోత్తపురం పంచాయతీ పరిధి యు.గెద్దలపాడు గ్రామంలో గడప గడపకు నిధులు రూ. 5 లక్షల అంచనా వ్యయంతో రాకాసిగెడ్డ సాగునీటి కాలువపై సిమెంటు వంతెన నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లద్దు కేశవపాత్రో, జేసీఎస్ కన్వీనర్ కె.సురేష్, స్థానిక నాయకులు పైల మోహనరావు, పైల త్రినాథ్ పాల్గొన్నారు.

### చెరువులో పూడికతీత పనులు



పనులు చేస్తున్న వేతనదారులు

సోంపేట: గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని సుంకిడి సర్పంచ్ శిలగాన భాస్కరరావు అన్నారు. పంచాయతీ పరిధిలోని పెద్ద చెరువులో పూడికతీత పనులు ఆదివారం ప్రారంభించారు. రైతులకు ప్రయోజనం కలిగే పనులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

# జోరు వానలో.. గడప గడపకు..

- సంక్షేమాన్ని వివరించిన సమన్వయకర్త సాయిరాజ్



జోరు వానలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సాయిరాజ్

సోంపేట: కొర్లాం గ్రామంలో జోరు వానలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆదివారం నిర్వహించారు. వర్షంలో తడుస్తూనే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే నాలుగేళ్లలో సమకూరిన లబ్ధిని తెలియజేసి అందుకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాయిరాజ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు తెలుసుకొని.. వాటిని పరిష్కరించడం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకపోతే సమస్యను తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. నిరంతరం ప్రజాసంక్షేమం కోసం కృషి చేస్తున్న సీఎం జగన్‌కి ప్రజలు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పార్టీ నాయకులు బంగారు పాపారావు, బత్తిని బాలరాజు, తులసీరావు, కోట్నీ శ్రీను, ఎస్.రాజు, వర్మ, రమేష్ పాల్గొన్నారు

**నేడు చినంచలలో..**

కాశీబుగ్గ: పలాస మండలం చినంచల పంచాయతీలో సోమవారం ఉదయం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ కంచరాన సుజాత తెలిపారు. కార్యక్రమంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొంటారన్నారు. సచివాలయ, వివిధ శాఖల అధికారులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

# పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్చండి



కోటబొమ్మాళి: ఊడికిలపాడులో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు



ఇచ్ఛాపురం రూరల్: విద్యార్థుల పేరెంట్స్‌తో మాట్లాడుతున్న హెచ్‌ఎం రాధాకృష్ణన్

కోటబొమ్మాళి: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా చీపుర్లపాడు పంచాయతీ ఊడికిలపాడు యూపీ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఆదివారం గ్రామాల్లోకి వెళ్లి ఐదో తరగతి పాసైన విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి తమ పాఠశాలల్లో పిల్లలను ఆరో తరగతిలో చేర్పించాలని కోరారు. విద్యాకు ప్రభుత్వం సమకూర్చుతున్న వనరులను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నీలామోహన్, సర్పంచ్ నేతింటి అప్పలస్వామి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పొన్నాన సింహాచలం, వలంటీర్లు సదునుపల్లి వెంకటరావు, ఎస్.నర్సింహమూర్తి, ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: అనుభవనీయులైన ఉపాధ్యాయులు, కార్పొరేట్ స్థాయిలో మౌలిక సదుపాయాలున్న సర్కారు బడుల్లోనే పిల్లల్ని చేర్పించాలని ఈదుపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సదాశివుని రాధాకృష్ణన్ కోరారు. ఆదివారం రాత్రి ఆయన తోటి ఉపాధ్యాయులతో కలసి ఈదుపురం, తిప్పనపుట్టుగ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఆరో తరగతిలో చేరబోయే విద్యార్థుల తల్లిదండ్రులను కలసి అడ్మిషన్లు తీసుకోవాలని కోరారు. ఉచితంగా జగనన్న విద్యా కానుకలు, జగనన్న గోరుముద్ద, ఏకరూప దుస్తులు, ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేయడం జరుగుతుందని అన్నారు.

# యువకులకు సత్కారం



యువకులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: టీం జగనన్న యాప్‌తో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నటువంటి పలాస నియోజకవర్గానికి చెందిన యువకులను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం సత్కరించారు. పలాస మంత్రి క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సోషల్ మీడియా ప్రతినిధులైన దున్న కృష్ణారావు, జామి రామక్రిష్ణ, బమ్మిడి సంతోష్‌కుమార్‌కు ప్రశంసాపత్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, పట్టణ అధికార ప్రతినిధి శిష్టు గోపి, 20వవార్డు పార్టీ ఇన్‌చార్జి అంబటి ఆనందరావు పాల్గొన్నారు.

### ఘనంగా దానప్ప సంబరం



దానప్ప వేషధారణలో పూజారి కృష్ణ

ఇచ్ఛాపురం రూరల్: లొండపుట్టుగలో దానప్ప సంబరం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు ఉదయం పుట్టకు ఉపాసం చెప్పిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దానప్ప వేషధారణలో పూజారి మేళతాళాలు మధ్య అమ్మవారిని ఊరేగించారు.

### నేటినుంచి అసిరమ్మ దేవత ఉత్సవాలు



అసిరమ్మదేవి

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి గ్రామంలో సోమవారం నుంచి గ్రామ దేవత అసిరమ్మ దేవత సంబరాలు జరుగనున్నాయి. 20 ఏళ్ల తరువాత ఉత్సవాలను నిర్వహిస్తుండడంతో కమిటీ సభ్యులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. తొమ్మిది రోజుల పాటు జరగనున్న సంబరాల్లో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారిని మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచాల శబ్దాల మధ్య పొలిమేర నుంచి గ్రామంలోకి ప్రజలు ఆహ్వానిస్తారు.

# అసిరి పోలమ్మ సంబరాలు ప్రారంభం



హరిదాసుపురంలో దేవరను ఊరేగిస్తున్న దృశ్యం

నందిగాం: హరిదాసుపురంలో 20 సంవత్సరాల తర్వాత నిర్వహిస్తున్న అసిరి పోలమ్మ తల్లి సిరిమాను సంబర ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఉత్సవం ప్రారంభసూచికగా పందిరిరాట వేశారు. అనంతరం గ్రామంలోని మహిళలు సామూహికంగా ఆలయం వద్దకు చేరుకొని ముగ్రాటలతో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి విశేష అలంకరణ చేసి అమ్మవారి ప్రతి రూపమైన దేవర (దేవతా ప్రతిమలు)ను పగటి వేషాలతో, మేళతాళాలతో ఊరేగింపుగా పూజారి కంచరాన పోలయ్య ఇంటికి చేర్చారు.

**దేవుపురంలో..**

దేవుపురం గ్రామంలోని వెలగపోలమ్మ తల్లి సంబరాలు కూడా ఆదివారం ప్రారంభమయ్యాయి. గుడిలోని అమ్మవారిని తప్పెటగుళ్లు, మేళతాళాలు, పగటి వేషాలతో గ్రామంలోకి తీసుకువచ్చారు. అలాగే గ్రామానికి చెందిన సింగర్ టొంప సతీష్ వెలగ పోలమ్మ అమ్మవారి మీద పాడిన పాటల సీడీని స్థానిక సర్పంచ్ యర్ర విశ్వశాంతి చక్రవర్తి విడుదల చేశారు. అలాగే నందిగాం గణేష్ కాలనీలో నిర్మించిన అభయాంజనేయ స్వామి మందిర ప్రతిష్ట కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమయ్యాయి

# ఆటలతో సందడి



టెక్కలి: ఆటలాడుతున్న పిల్లలు



సోంపేట: వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

టెక్కలి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులంతా ఆటలతో సందడి చేశారు. పుస్తక పఠనంతో పాటు పలు రకాల క్రీడలను గ్రంథాలయ సిబ్బందిఆడించారు .

సోంపేట: బారువ గ్రంథాలయంలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు అన్నారు. గ్రంథాలయాధికారి ధర్మారావు పాల్గొన్నారు.

# వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు సెలవుల్లో సరదాగా కార్యక్రమంలో భాగంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించినట్టు ఇన్నేశుపేట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం బి.శంకరం అన్నారు. పాఠశాలలో 15 రోజుల శిక్షణ అనంతరం విద్యార్థులకు ఆదివారం బుక్‌లెట్లు అందజేశారు. ఇప్పటికే విద్యార్థులకు రెండు దశల్లో ప్రతిభా పరీక్షలు నిర్వహించడం జరిగిందని, పాఠశాలలు పునః ప్రారంభం నాటికి పూర్తిగా చదవడం, రాయడం వంటి కృత్యాలు, సమార్థ్యాలు చేయగలరని అన్నారు.

# ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష తగదు




కొవ్వొత్తుల ర్యాలీలో సీహెచ్‌సీ సిబ్బంది

ఇచ్ఛాపురం: ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపకుండా ప్రేమ, దయాగుణం కలిగి ఉండాలని స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.దేవేంద్రరెడ్డి అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల స్మారక దినోత్సవాన్ని ట్రక్కర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్‌తో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఆస్పత్రి కూడలి నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రక్కర్ ప్రాజెక్టు అధికారి ఎం.మాధవరావు, ఐసీటీసీ కౌన్సిలర్ బి.రాజశేఖర్, డాక్టర్ మోహన్‌రావు, సీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

# నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం



చెక్కును ఈఓకు అందజేస్తున్న వడ్లమూడి సరోజిని

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వడ్లమూడి సరోజిని తన భర్త రమేష్‌బాబు జ్ఞాపకార్థం రూ.1,00,116 విరాళంగానూ, అలాగే వీరమచినేని వీరరాఘవయ్య, నాగభూషణమ్మల జ్ఞాపకార్థంగా కూడా రూ.1,00,116 విరాళాన్ని నిత్యాన్నదాన ట్రస్ట్‌కు సమర్పించారు. ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్‌కు విరాళ చెక్కును ఆదివారం అందజేశారు. పాలక మండలి సభ్యుడు మండవిల్లి రవి, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అపూర్వ కలయిక



సోంపేట ఆదర్శ పాఠశాల వద్ద అపూర్వ కలయికలో 1987-88 విద్యా సంవత్సరం విద్యార్థులు



సోంపేట: బారువ ఉన్నత పాఠశాల వద్ద ఆత్మీయ సమ్మేళనంలో 1996-97 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు



కాశీబుగ్గ: ఒకే వేదికపై చినబడం జెడ్పీ ఉన్నత పాఠశాల 1989-90 విద్యా సంవత్సరం విద్యార్థులు



కోటబొమ్మాళి బాలుర హైస్కూల్‌లో కలిసిన 1997-98 విద్యా సంవత్సరం విద్యార్థులు



కవిటి:రాజపురం జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో కలుసుకున్న 1998-99 విద్యా సంవత్సరం విద్యార్థులు

వారంతా ఒకే పాఠశాలలో పదో తరగతి చదువుకొని వేర్వేరు ప్రాంతాల్లో.. వివిధ హోదాల్లో స్థిరపడ్డారు. దశాబ్దాల తరువాత అక్షరాలు నేర్చుకున్న పాఠశాలల ఆవరణలోనే ఆదివారం కలుసుకొని మురిసిపోయారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. గ్రూపు ఫొటోలు తీసుకొని సందడి చేశారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కష్టాల్లో ఉన్న పూర్వ విద్యార్థులకు అండగా ఉండాలని నిర్ణయించారు. చదువు నేర్పిన గురువులను దుశ్శాలువలతో సత్కరించి గౌరవించారు. పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# అధికారులు బాగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: అధికారులు బాగా పని చేయడం ద్వారానే ప్రభుత్వానికి మంచిపేరు వస్తోందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ఆయా శాఖల అధికారులు వివరించారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అధికారులపై ఉందని పలువురు సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సల్ల సుగుణ పాల్గొన్నారు.